క్లుప్తంగా

మంత్రి కందుల దుర్గేష్ రాక



ధవళేశ్వరంలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి దుర్గేష్

ధవళేశ్వరం: మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి ధవళేశ్వరం విచ్చేసిన రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు శుక్రవారం స్వాగతం పలికారు. తొలుత ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ సెంటర్‌లోని కాటన్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ధవళేశ్వరం ఏపీఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు ఆయనను సన్మానించారు.

35 మందికి ఉద్యోగాలు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం జరిగిన దివీస్ ల్యాబ్స్ ప్రాంగణ ఎంపికల్లో 35 మంది ఉద్యోగాలు సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ ఇంటర్వ్యూలకు 110 మంది విద్యార్థులు హాజరవ్వగా, 35 మంది ఎంపికయ్యారన్నారు. వారిలో తమ కళాశాలకు చెందిన 23 మంది విద్యార్థులు ఉండడం ఆనందకరమన్నారు. బీఎస్సీ విద్యార్థులు 26 మంది, ఎమ్మెస్సీ విద్యార్థులు ముగ్గురు, బీటెక్ నుంచి ఐదుగురు, బీఫార్మసీ నుంచి ఒకరు ఎంపికయ్యారని తెలిపారు.

తాతా సందీప్ శర్మకు పురస్కారం



సందీప్ శర్మకు పురస్కారం అందజేస్తున్న ప్రముఖులు

ప్రకాశం నగర్: శతవధాని తాతా సందీప్ శర్మకు స్పిరిచ్యువల్ సైంటిస్ట్ అవార్డు (ఆధ్యాత్మిక శాస్త్రవేత్త పురస్కారం) లభించింది. సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రకటించిన ఈ అవార్డును ఆధ్వర్యంలో ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, సెంటర్ డైరెక్టర్ చల్లా అభిషేక్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. అవధాన, ప్రవచన రంగాలలో చేస్తున్న కృషికి గుర్తింపుగా సందీప్ శర్మకు ఈ గౌరవం దక్కింది.

ఉపాధి కూలీకి పాముకాటు

కడియం: మండల కేంద్రమైన కడియం గ్రామం పరిధిలో శుక్రవారం ఉపాధి పని చేస్తున్న నాకరపు వెంకటలక్ష్మిని పాము కాటు వేసింది. వెంటనే ఆమెను కడియం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతోంది. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

ఈదురుగాలి బీభత్సం

కడియం: మండలంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలి బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచీ ఉక్కపోత ఇబ్బంది పెట్టింది. రాత్రి ఏడు గంటల సమయానికి కారు మబ్బులు కమ్మేశాయి. మెల్లగా మొదలైన ఈదురు గాలి దాదాపు గంటకుపైగా హడావుడి చేసింది. అనంతరం వర్షం ప్రారంభమైంది. దీంతో ఎక్కడికక్కడే జనం స్తంభించింది. మండలంలోని పలు గ్రామాల్లో విస్తరించి ఉన్న నర్సరీల్లో పెద్ద సైజు మొక్కలు నేలనంటాయి. ఈదురు గాలితో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం నుంచి ఎండ ప్రతాపం, ఉక్కపోతలు సతమతం చేసినప్పటికీ, రాత్రికి వాతావరణం చల్లబడడంతో ప్రజలు కాస్తంత ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈదురు గాలి మాత్రం ఆందోళన కలిగించింది.

సేవలను గుర్తిస్తే పదవులే దగ్గరకు వస్తాయి



విలేకరులతో మాట్లాడుతున్న గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ: పదవుల కోసం తాను ఏనాడూ ఎవరినీ అడగలేదని, పార్టీకి తాను చేసిన సేవలు గుర్తిస్తే ఆ పదవులే తన దగ్గరకు వస్తాయని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన తొలి ఐదు సంతకాలు ఆయన చేయబోయే అభివృద్ధి, సంక్షేమానికి నిదర్శనమని కొనియాడారు. చంద్రబాబు లాంటి విజనరీ నాయకుడిని ప్రజలు కోరుకున్నారని, అందుకే రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విజయం అందించారన్నారు. చంద్రబాబు పాలనలో కక్ష సాధింపు రాజకీయాలు ఉండవన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వీరి ఎత్తుకు ప్రత్యర్థి చిత్తే..

- చదరంగంపై పెరుగుతున్న ఆసక్తి
- జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో రాణిస్తున్న చిన్నారులు
- సత్తా చాటుతున్న బాలబాలికలు



చదరంగం పోటీలలో పాల్గొన్న చిన్నారులు

ప్రకాశం నగర్: పిల్లలకు చదువుతో పాటు ఆటపాటలు చాలా అవసరం. తరగతిలో గదిలో నేర్చుకునే చదువుతో మంచి మార్కులు వస్తే, ఆటపాటలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుంది. తద్వారా అన్ని విషయాలలో ముందంజలో ఉంటారు. ముఖ్యంగా ఒత్తిడిని అధిగమించి విజయ శిఖరాలను అధిరోహిస్తారు. ఆటల్లో చదరంగానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ప్రత్యర్థిని చిత్తు చేయడానికి వారు చేసే ఆలోచన.. మెదడును మరింత చురుగ్గా ఉంచుతుంది. తెలివితేటలను పెంచుతుంది. చదరంగంలో నగరంలోని చిన్నారులు, యువత దూసుకుపోతున్నారు. వివిధ పోటీలలో ఉత్సాహంగా పాల్గొంటూ, విజయాలను సాధిస్తూ పతకాలను గెలుచుకుంటున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలోనూ ప్రతిభ చూపుతున్నారు.

హోరాహోరీగా..

జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని ఐరన్ అండ్ పెయింటర్స్ అసోసియేషన్ హాలులో ఇటీవల జిల్లా స్థాయి ఓపెన్, మహిళల చదరంగం పోటీలు హోరాహోరీగా జరిగాయి. జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో బాలురు, బాలికల విభాగంలో జరిగిన ఈ పోటీలలో సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో విజయం సాధించిన మొదటి నలుగురూ విజయవాడలో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అలాగే బాలికల విభాగంలో విజయం సాధించిన నలుగురూ ఈ నెల 25, 26 తేదీల్లో హిందూపూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారు. బాలుర విభాగంలో కె.సాకేత్, వై.కల్యాణ్ కుమార్, కె.సీతా సాగర్, ఐ.గోపీకృష్ణ, బాలికల విభాగంలో అక్షయ్ కరక్, రష్మి, రిషిత, కావ్యశ్రీ విజయం సాధించారు.

ఒత్తిడి మాయం

చదరంగం ఆడడం వల్ల మెదడు చురుకుగా ఉండి, జ్ఞాపక శక్తి పెరుగుతుంది. విద్యార్థులకు చదువుల కారణంగా ఏర్పడే మానసిక ఒత్తిడి దూరమవుతుంది. అలాగే సమస్యను అధిగమించడానికి పోటీతత్వం ఏర్పడుతుంది. అతిగా మతిమరుపు ఉన్న చిన్నారులకు చదరంగం ఒక మంచి ఔషధంగా పని చేస్తుందని వైద్యులు చెబుతున్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి పోటీలు

గోదావరి బండ్ రోడ్డులోని వైఎంఏ హాలులో ఆదివారం నుంచి జిల్లాస్థాయి చదరంగం పోటీలు జరగనున్నాయి. జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో అండర్– 19 బాలురు, బాలికల విభాగంలో పోటీలు జరుగుతాయి. 1-1-2005 తర్వాత పుట్టిన క్రీడాకారులు ఈ పోటీలకు అర్హులు. పాల్గొనే క్రీడాకారులు ఏపీచెస్‌ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు.

ఆలోచనా శక్తి పెంపు



ఆలోచన శక్తిని పెంచుకునేందుకు చదరంగం ఎంతో ఉపయోగపడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా చదరంగం ఆటకు మంచి గుర్తింపు ఉంది. జిల్లా చదరంగం సంఘం ద్వారా అనేక మంది క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వడంతో పాటు పతకాలు సాధించడం ఎంతో గర్వకారణం. గతంతో పోలిస్తే ఇప్పుడు చిన్నారులు, యువత చదరంగం ఆవశ్యకతను గుర్తించి , ఆటలోని మెళకువలను నేర్చుకుంటున్నారు.

– జీవీ కుమార్,
జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల రక్తదానం



ప్రభుత్వాసుపత్రి వద్ద అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులు

కంబాలచెరువు: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆదిత్య ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాసుపత్రి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. వీరిని ర్యాలీని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఎం.లక్ష్మీసూర్యప్రభ ప్రారంభించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వీఎల్ పురం, తిలక్ రోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ప్రతిజ్ఞ బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ రాజశేఖర్, డాక్టర్ జి.సూర్యనారాయణ, డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, ఆర్ఎంవో ప్రణవ్, డాక్టర్ పి.సుజాత పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్ డే

కంబాలచెరువు: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది సమస్యలను ఎస్పీ పి.జగదీష్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్‌డేలో సిబ్బంది సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తున్నామన్నారు.

కాలుష్య రహితంగా రాజమహేంద్రవరం

- ప్రణాళికతో పారిశుధ్య నిర్వహణ
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్, కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: కాలుష్య రహితంగా, పరిశుభ్రంగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలో నిర్వహిస్తున్న శానిటేషన్, డీసిల్టేషన్, ఫాగింగ్, స్ప్రేయింగ్ నిర్వహణ వంటి అంశాలపై కమిషనర్ కె.దినేష్ కుమార్‌తో కలిసి శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో అనేక మాల్స్, పార్కులు, ఆధ్యాత్మిక కేంద్రాలు ఉన్నాయని, ప్రతి రోజూ వివిధ పనులపై ప్రజలు వస్తూ ఉంటారన్నారు. నగరాన్ని పచ్చదనంతో పరిశుభ్రంగా తీర్చదిద్దాలన్నారు. వాంబే గృహాల పరిసర ప్రాంతాలలో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణను పక్కా ప్రణాళికతో అమలు చేయాలన్నారు. 2027లో జరిగే పుష్కరాలకు ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం పనులు ప్రారంభించాలని సూచించారు. కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ కాలుష్య రహిత స్వచ్ఛ నగరంగా రాజమహేంద్రవరాన్ని తీర్చిదిద్దడంలో ప్రజా ప్రతినిధులు అందిస్తున్న పలు సూచనలు, సలహాలను ఆచరణలోకి తీసుకుని అమలు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, ఎంహెచ్‌ఓ డాక్టర్ వి.వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ ఐ.శ్రీనివాస్, ఆర్ఎంసీ అధికారులు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి పదవి ఆశించా: ఎమ్మెల్యే గోరంట్ల



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్: తాను ఈసారి మంత్రి పదవిని ఆశించానని, సుదీర్ఘ కాలంగా రాజకీయాలలో ఉన్న తాను అలా ఆశించడంలో తప్పు లేదని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోరంట్ల మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు వెళుతున్నారన్నారు. గతంలో రూరల్‌లో రెవెన్యూ శాఖ భూములు కబ్జా చేసిందని, చాలా భూములు అన్యాక్రాంతం అయ్యాయని, దీనిపై జిల్లాలోని అధికారులపై విచారణ జరిపిస్తామన్నారు. గతంలో ఇబ్బందులు పెట్టి తప్పుడు కేసులు పెట్టిన వారిపై కచ్చితంగా వేటు తప్పదన్నారు.

ఎమ్మెల్యే గోరంట్ల పర్యటన

ధవళేశ్వరం: గ్రామంలోని సాయిబాబా గుడి వద్ద ఉన్న మురుగుకాలువ మళ్లింపు పథకం ప్రాంతాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో రాజమహేంద్రవరంలోని వరదనీటితో రామకృష్ణ నగర్, నేతాజీనగర్, రైల్వేస్టేషన్ ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. మురుగునీరు తోడేందుకు రూ.3.60 కోట్లతో 360 హార్స్‌పవర్ పంపులతో ప్రాజెక్టు మొదలైందన్నారు. రూరల్ నియోజక వర్గంలో డ్రైనేజీ సమస్య అధికంగా ఉందన్నారు.

వివాహిత ఆత్మహత్య

తోటపల్లిగూడూరు: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రాత్రి వరిగొండ పంచాయతీలో జరిగింది. శుక్రవారం ఎస్సై జంపానీ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన షేక్ రజియా బేగం (27) భర్త చనిపోయాడు. ఆమె తన కుమార్తెతో కలిసి వరిగొండ పంచాయతీ రావూరువారికండ్రికలో గతేడాది నుంచి నివాసం ఉంటోంది. రజియా ధనలక్ష్మీపురంలో బేకరీ నిర్వహిస్తోంది. భర్త మృతితో ఆమె కొంతకాలంగా తీవ్ర మానసిక వేదనలో ఉండేది. ఇటీవల రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నిస్తే సోదరుడు అడ్డుకున్నాడు. గురువారం అర్ధరాత్రి ఆమె తన నివాసంలో ఉరేసుకుంది. కుటుంబసభ్యుల సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

విద్యార్థుల విషయంలో జాగ్రత్తలు పాటించాలి

కంబాలచెరువు: నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైందని, స్కూలు యాజమాన్యాలు తమ వద్ద చదువుతున్న పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలను ఎస్పీ పి.జగదీష్ కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం స్కూళ్లు, కాలేజీల యాజమాన్యాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సంక్షేమంలో భాగంగా పోలీసు పిల్లల ఫీజులలో రాయితీ ఇవ్వాలని కోరారు. బాల్య వివాహాలు, యాంటీ డ్రగ్స్, ట్రాఫిక్ నియమాలు, సైబర్ క్రైమ్ సోషల్ మీడియాలపై అవగాహన కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న విద్యార్థులకు మాత్రమే కాలేజీకి బైక్‌పై వచ్చేందుకు అనుమతి ఇవ్వాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అడిషనల్ ఎస్పీలు పి.అనిల్ కుమార్, ఎల్.చెంచిరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ డి.ప్రభాకర్, సూరి అప్పారావు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి కల్యాణం రేపు



ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి

పెదపూడి: పుట్టకొండలో ప్రసిద్ధి చెందిన భద్రకాళీ సమేత వీరభద్ర స్వామివారి కల్యాణం ఈ నెల 16న ఘనంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే రాట మూహూర్తం చేశారు. కల్యాణం రోజున ఆదివారం ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేస్తారు. 10 గంటలకు కల్యాణ ఘట్టం ప్రారంభమవుతుంది. ఆలయ ప్రధాన అర్చకుడు పున్నమరాజు కమలాకర్ అధ్వర్యంలో పండితులు కల్యాణ క్రతువులు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణ తంతు పూర్తి చేశారు. అనంతరం 12.20 గంటలకు హోమం పూజలు చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు కల్యాణమూర్తులను ఊరేగిస్తారు. రాత్రి 7 గంటలకు స్వామి, అమ్మవార్లకు శ్రీపుష్పయాగం చేస్తారు. గ్రామస్తుల సహకారంతో జరిగే కల్యాణ ఏర్పాట్లను ఆలయ చైర్మన్, మాజీ సర్పంచ్ వల్లు సత్యనారాయణ, సర్పంచ్ వల్లు వెంకటరమణ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని వినాయక వెంకట సాయి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 21 వరకూ కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. వీటిలో భాగంగా 17న స్వామివారికి అభిషేకాలు, 18వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం, 19వ తేదీ రాత్రి 7 గంటలకు గ్రామోత్సవం, 20వ తేదీన అన్నసమారాధన, 21న పుష్పోత్సవం జరుగుతాయి. అలాగే ఉత్సవాల సందర్భంగా ఈనెల 12వ తేదీన సుమారు 40 మంది భక్తులు స్వామివారి మాలధారణ చేశారు.

ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పనిచేయాలి

- కార్యకర్తలకు అండగా నిలబడతాం
- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం సిటీ: అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం చేసే అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, అయితే కక్ష సాధింపు విధానాలు సరికాదన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శిలాఫలకాలను ధ్వంసం చేయడం సరైనది కాదన్నారు. ఈ చర్యను సరిచేస్తూ ఆదిరెడ్డి అప్పారావు అక్కడ శిలాఫలకాన్ని పునరుద్ధరించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మోరంపూడి వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ చూపిన చొరవ, కృషి అభినందనీయమన్నారు. గత టీడీపీ హయాంలో ఫ్లైఓవర్‌కు సంబంధించి పేపర్ వర్క్ జరిగి ఉండవచ్చని, భరత్ రామ్ కృషితో 80 శాతం వరకు నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. వ్యక్తిగత ఆరోపణలు, దూషణలను పక్కన పెట్టి నగరంలో ఆరోగ్యకరమైన రాజకీయాలకు తెరలేపాలని సూచించారు. తమ పార్టీ ఓటమికి కారణాలను విశ్లేషించుకుంటున్నామన్నారు. ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తామన్నారు. పార్టీని తిరిగి గాడిలో పెట్టేందుకు అన్ని విధాలా కార్యకర్తలకు అందుబాటులో ఉండి పనిచేస్తామన్నారు. ఆదిరెడ్డి కుటుంబం అరెస్ట్ వెనుక మార్గాని భరత్‌రామ్ లేరన్నారు. నక్కా శ్రీనగేష్ మాట్లాడుతూ ఈవీఎంల విషయంలో మోసం జరిగిందని ప్రజలు అనుమానిస్తున్నారన్నారు. తాము వేసిన ఓట్లు ఎక్కడికి పోయాయని అడుగుతున్నారని గుర్తు చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు పోలు విజయలక్ష్మి, సంకిస భవానీ ప్రియ, పితాని లక్ష్మీకుమారి, కడలి వెంకటేశ్వరరావు, ఏవీ శ్రీనివాస్, పెంకే సురేష్, బిల్డర్ చిన్న పాల్గొన్నారు.

వైభవంగా మంగళ హారతులు

కడియం: కడియపులంకలో కొలువైన ముసలమ్మ ఆలయంలో శుక్రవారం పంచ మంగళ హారతులు వైభవంగా జరిగాయి. ప్రతి శుక్రవారం భక్తుల సహకారంతో వీటిని నిర్వహిస్తున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన ఈ కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచాలి

రాజమహేంద్రవరం సిటీ: వర్షాకాలం ప్రారంభమైనందున నగరంలోని ఖాళీ స్థలాలు, పల్లపు ప్రదేశాలలో నీరు నిల్వ ఉండిపోతుందని, వాటిలో దోమలు పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడతారని కమిషనర్ దినేష్ కుమార్ అన్నారు. ఈ నేపథ్యంలో ఖాళీ స్థలాల యజమానులు వాటిని శుభ్రం చేసుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా మెరక చేసుకోవాలని ఆదేశించారు. ఖాళీ స్థలాలలో నీరు చేరడం దోమలు పెరిగిపోయి.. చుట్టుపక్కల నివసించే వారికి డెంగీ, మలేరియా వంటి వ్యాధులు సంక్రమిస్తున్నాయన్నారు. నిబంధనలు పాటించని స్థలాల యజమానులపై చర్యలు చేపడతామన్నారు.

స్పిన్నింగ్ మిల్లు కాలనీలో చోరీ

రాజమహేంద్రవరం రూరల్: తన ఇంట్లో దొంగలు పడి 20 గ్రాముల బంగారం వస్తువులు, సెల్‌ఫోన్ చోరీ చేశారని స్పిన్నింగ్ మిల్లు కాలనీకి చెందిన కొత్త శ్రీనివాసరెడ్డి శుక్రవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీనివాసరెడ్డి ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడు. గురువారం విధుల నుంచి వచ్చి ఇంటిలో పడుకున్నాడు. తెల్లవారిన తర్వాత చూసేసరికి ఇంటిలోని 20 గ్రాముల విలువైన బంగారం గొలుసు, ఉంగరం, ఒక సెల్‌ఫోన్ చోరీకి గురైందని గుర్తించారు. బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కడియం: వేమగిరి పంచాయతీలో చేపడుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను ఆ గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ శుక్రవారం పరిశీలించారు. రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీలలో పూడికతీత పనులను అదనపు పారిశుధ్య కార్మికులతో చేపడుతున్నారు. వేమగిరి తోట మెయిన్ డ్రైనేజీ మ్యాన్ హోల్స్ మూసుకుపోయినందున వాటి అడ్డులను తొలగించారు. అలాగే దేవి జనార్దన నగర్ కొండ కాలువ పూడికతీత పనులను ఎంపీడీవో పరిశీలించారు.

స్పా సెంటర్‌పై పోలీసుల దాడి

కంబాలచెరువు: ఏవీ రోడ్డులోని ఒక స్పా సెంటర్‌పై శుక్రవారం పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు బ్యూటీ పార్లర్, జిమ్ నిర్వహిస్తున్న ఒక సెంటర్‌పై ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. ఆ సమయంలో స్పా సెంటర్‌లో మసాజ్‌లు చేస్తున్న యువతులను, యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులను ఆరా తీయగా తమకింకా సమాచారం రాలేదని చెబుతున్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు

కంబాలచెరువు: పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు చేర్చాలని స్టేట్ ప్రాజెక్ట్ అధికారి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా జిల్లాలో కొందరు ఎంఈఓలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ తెలిపారు. వారు శుక్రవారం మాట్లాడుతూ ఉపాధ్యాయులనే పుస్తకాలను స్కూళ్లకు తీసుకెళ్లమని కొందరు ఎంఈవోలు అనడాన్ని ఖండించారు. జిల్లాలోని 19 మండలాలలో 14 మండలాల ఎంఈఓలు పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలలకు సక్రమంగా చేర్చారని, నిడదవోలు, కొవ్వూరు, దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల ఎంఈఓలు మాత్రం ఉపాధ్యాయులే పాఠ్యపుస్తకాలను స్కూళ్లకు తీసుకెళ్లాలని అజమాయిషీ చేస్తున్నారన్నారు. పైగా ప్రభుత్వం నుంచి తమకింకా సొమ్ములు రాలేదని వచ్చిన వెంటనే ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను ఉపాధ్యాయులకు చెల్లిస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. పాఠ్య పుస్తకాలను స్కూళ్లకు తరలించడానికి ఒక్కో పాఠశాలకు రెండు నుంచి మూడు వేల రూపాయల వరకు ఉపాధ్యాయులకు ఖర్చవుతోందన్నారు. ఇలాంటి అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆ యాక్ట్ రద్దయ్యిందనే ప్రచారం అవాస్తవం



మేడా శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: చంద్రబాబు సంతకం చేస్తే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు కావడం అసాధ్యమని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్పీసీ) వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు జగన్ సర్కార్ ఈ చట్టానికి ఆమోదం తెలిపిందని, దీనికి రాష్ట్రపతి ఆమోద ముద్ర కూడా లభించిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకం చేయటంతో ఈ చట్టం రద్దు కాదనే విషయం సంబరాలు చేసుకుంటున్న న్యాయవాదులకు తెలియనిది కాదన్నారు. ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ (ఆలా) సహా కొన్ని న్యాయవాద సంఘాలు, న్యాయవాదులు సైతం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేయాలంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యాలు దాఖలు చేశారని తెలిపారు. అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు పంపిన తదుపరి రాష్ట్రపతి ఆమోద ముద్ర లభించిన తరువాతనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దయినట్టు భావించాలన్నారు. చంద్రబాబు చేసిన సంతకం చట్టం రద్దుకు ముఖ్యమంత్రి హోదాలో అంగీకరించినట్లు మాత్రమేనని, కానీ ఆ చట్టం రద్దయ్యిందనే ప్రచారాల్లో ఏ మాత్రం నిజం లేదన్నారు.

సాహసోపేత నిర్ణయం

కంబాలచెరువు: భూ హక్కు చట్టాన్ని రద్దు చేయడం సాహసోపేతమైన నిర్ణయని రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్ అన్నారు. ఏపీ భూహక్కు చట్టాన్ని రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రాజమండ్రి బార్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కృతజ్ఞతా కార్యక్రమం నిర్వహించారు. జనరల్ సెక్రటరీ పెల్లూరి రమేష్, కోశాధికారి కర్ర హనుమంతరావు, సహ కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మూడు ఆవుల మృతి





మృతి చెందిన ఆవులు



రాజానగరం: మండలంలోని సూర్యారావుపేటలో పిడుగుపాటుకు ఇద్దరు రైతులకు చెందిన మూడు ఆవులు మృతి చెందాయి. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో పాటు పిడుగులు పడటంతో వల్లభశెట్టి సత్యనారాయణకు చెందిన రెండు ఆవులు, ముప్పిడి పెద్దలుకు చెందిన ఒక ఆవు చనిపోయాయి. వీటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని అంచనా. అయితే వీటికి బీమా చేయించినట్టుగా ట్యాగ్‌లు ఉన్నాగాని, ప్రస్తుతం అటువంటి పథకాలు అమలులో లేవంటూ సంబంధిత అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సినిమాలు

శ్యామల	:	హరోంహర
సూర్యమినీ	:	చందు చాంపియన్
సూర్యప్యాలెస్	:	హరోంహర
స్వామి	:	మహారాజ
శివజ్యోతి	:	యేవమ్, సత్యభామ
అనుశ్రీ	:	మనమే
రాజా	:	బ్యాడ్‌బాయ్స్
ఊర్వశి	:	రాజధాని రౌడీ
రంభ	:	ఇంద్రాణి
మేనక	:	సత్యభామ
అప్సర	:	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి	:	మ్యూజిక్ షాప్ మూర్తి
నామవరం		
వీఎస్ మహల్	:	హరోంహర
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	మ్యూజిక్‌షాప్ మూర్తి
కడియం		
వెంకటసూర్య	:	హరోంహర